క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



చిన్నగూడూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత అన్నారు. శుక్రవారం మండలంలోని గుండంరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్‌హుడ్ అండ్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపించాలని సూచించారు. ప్రీ స్కూల్ ఆక్టివిటీస్ గురించి, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



డోర్నకల్: డ్రైవింగ్ నిబంధనలు అతిక్రమించే కఠిన చర్యలు తీసుకుంటామని డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు వాహనదారులను హెచ్చరించారు. స్థానిక బైపాస్ రోడ్డు వద్ద శుక్రవారం ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు వాహన తనిఖీ నిర్వహించి పలువాహనాలకు జరిమానాలు విధించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారుల నిర్లక్ష్యంతో ఇటీవల రోడ్డు ప్రమాదాలు బాగా పెరిగాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్‌రావు, తిరుపతి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఏకతాటిపై నడవాలి



నెల్లికుదురు: ముదిరాజ్‌లంతా ఏకతాటిపై నడిచినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. మండలంలోని నైనాల గ్రామంలో ముదిరాజ్‌ల కుల దైవమైన పెద్దమ్మ గుడి నిర్మాణానికి శుక్రవారం ఆయన గ్రామ ముదిరాజ్‌లతో కలసి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్‌లు తోట ఉప్పలయ్య, వెంకన్న, రమేష్, సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, అశోక్, మహేందర్, సహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ ప్రణతికి సన్మానం



గార్ల: ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన పల్లెబోయిన ప్రణతిని శుక్రవారం గార్లలో యాదవ సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలంలోని బుద్దారం గ్రామంకు చెందిన నిరుపేద కుటుంబం పల్లెబోయిన నాగరాజు అరుణ దంపతుల కూతురు ప్రణతి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా నాయకుడు ఇమ్మడి గోవింద్, జడ శ్రీను, సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఇండియన్ పెంతెకోస్తు చర్చిలో చిల్డ్రన్స్ రిట్రీట్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరుగనున్న రిట్రీట్ శిక్షణలో భాగంగా పిల్లలకు ఆధ్యాత్మిక అంశాలపై నిజామాబాద్ పట్టణానికి చెందిన బ్రదర్ జేమ్స్ ఆటపాటలతో వివరించారు. పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలని, దేవుని యందు భయభక్తులు కలిగి జీవించాలని, ఉన్నత విద్యను అభ్యసిస్తూ సమాజంలో మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐపీసీ చర్చి పాస్టర్ మోజెస్, లిల్లీ అమ్మగారు, తదితరులు పాల్గొన్నారు.

తప్పితే తప్పుకాదు..!

- ఓటమి గెలుపునకు నాంది కావాలి
- విద్యార్థులు ఆత్మహత్య చేసుకోకుండా తల్లిదండ్రులు భరోసా ఇవ్వాలి

పెద్దవంగర: అనుకున్నవి జరుగవు అన్ని.. అనుకోకుండా జరుగుతాయి కొన్ని.. అనుకోలేదని ఆగవు కొన్ని.. జరగేవన్ని మంచికే అని అనుకోవడమే మనుషుల పని. కన్ను తెరిస్తే జననం.. కన్ను మూస్తే మరణం అన్నాడు ఓ కవి. పరీక్షలు బాగానే రాశామని అనుకొని తీరా ఫలితాలు విడుదలయ్యాక మార్కులు తక్కువగా వచ్చాయనో, ఫెయిల్ అయ్యామనో జీవితం ఇంతే అని కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైన ఎదురొడ్డి నిలబడాలి. ఒడిదొడుకులు ఎన్ని ఎదురైన ఓపికగా అలోచించి పరిష్కరించుకోవాలి.

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 17వ స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరంలో ఫలితాల్లో 55.72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 65.14 ఉత్తీర్ణత సాధించారు. బుధవారం డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో చిప్పా భార్గవి (17), మహబూబాబాద్ మండలం కొత్త రెడ్యాల గ్రామానికి చెందిన నేతి యశస్విని(16), గురువారం పెద్దవంగర మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఈదురు ప్రవళిక (16) ముగ్గురు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లిదండ్రులతోపాటు పలువురిని ఆందోళన కలిగించింది. ఫెయిలైన విద్యార్థులు చాలా మంది ఒత్తిడిలో ఉన్నారు. రాత్రిపగలు చదివిన ఫలితం దక్కలేదనే బెంగతో ఉన్నారు. జీవితంలో రాణించాలంటే మార్కులే ప్రామాణికం కాదనే విషయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిలో ధైర్యాన్ని నింపాలి.

భరోసా నింపాలి..

పిల్లలకు చిన్నప్పటి నుంచి చదువుతోపాటు భవిష్యత్‌పై అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు ఇరుగు పొరుగు వారితో పోల్చి వారిని పల్చన చేయొద్దు. కొందరూ తల్లిదండ్రులు వారివారి గ్రామాల్లోని గ్రూపులల్లో మా పిల్లలకు ఇన్ని మార్కులు వచ్చాయని షేర్ చేస్తూ అత్యుత్సాహం చూపిస్తున్నారు. ఇది సరైంది కాదు. ఫెయిలైన విద్యార్థులు దీంతో మరింత అవమాన భారంగా భావిస్తున్నారు. భవిష్యత్‌లో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందో వివరించి పిల్లలను సన్నద్ధం చేయాలి.

ప్రభుత్వాలు దృష్టి సారించాలి



విద్యావ్యవస్థలో ఫెయిలర్ సిస్టమ్‌ను తొలగించి గ్రేడింగ్ పద్ధతిని తీసుకురావాలి. దీనిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి. అలాగే ప్రతీ ఒక్కరూ వారి పిల్లలను గెలుపు ఎలా ఉండాలనే నేర్పిస్తారు. కానీ ఓటమిని ఎదుర్కోవడం నేర్పించరు. పరీక్షల్లో ఫెయిలైనా జీవితం అయిపోదుందనే భావన వారిలో తొలగిపోవాలి. తల్లిదండ్రుల, టీచర్ల నుంచి సపోర్టు వస్తే విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరగడంతోపాటు ఫెయిల్ అయినా తల్లిదండ్రులు అర్థం చేసుకుంటారనే భరోసా కలిగి ఉంటారు. ఆత్మహత్య చేసుకునేంత వరకు వెళ్లే అవకాశం ఉండదు.

\- రవీందర్ రెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం, పెద్దవంగర

బలరాంనాయక్‌ను మెజార్టీతో గెలిపించాలి



కూరగాయల మార్కెట్లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కోరారు. జిల్లా కేంద్రంలోని గాంధీపార్కు కూరగాయల మార్కెట్, రైల్వే స్టేషన్, నెహ్రూసెంటర్, తొర్రూరు బస్టాండ్ ప్రాంతాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కూరగాయలు విక్రయించే మహిళలు, చిన్నలను, పెద్దలను, ముసలవ్వలను ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ విజ్ఞప్తి చేశారు. బీజేపీ మతతత్వ రాజకీయాలకు ఎంతోమంది యువత, ప్రజలు, కొన్ని రాష్ట్రాలు బలవుతున్నాయని విమర్శించారు. దేశాన్ని ఐక్యం చేయడానికి భారత్ న్యాయ యాత్రతో రాహుల్ గాంధీ దేశ ప్రజల్లో సమైక్యతను నింపుతూ దేశ ప్రజలకు భరోసా ఇస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రెస్ మీట్‌లో కూర్చొని నేను వేలము దొరను అని చెప్పుకునే దానికి పనికొస్తాడు తప్పా.. అభివృద్ధి పనుల్లో ప్రతిపక్ష నాయకుడిగా ఇంతవరకు ఎక్కడ గాని కనిపించలేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య, వార్డ్ కౌన్సిలర్లు బానోత్ హరిసింగ్, పోతురాజు రాజు, అరెంపుల విజయలక్ష్మి, నాయకులు ప్రసాద్ నాయక్, ఖలీల్, విజయలక్ష్మి, సుదర్శన్, వెంకటేశ్వర్లు, రియాజ్, వంశీ, ప్రభాకర్, రమేశ్, రవి, విజయ, చిరంజీవి, రాజు, స్వర్ణలత పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్



మాట్లాడుతున్న హరిప్రియ

గార్ల: ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పిలుపునిచ్చారు. శుక్రవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టిందని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, అధికారం చేపట్టాక హామీలను గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, కార్యదర్శి రాధాకృష్ణ, ఎంపీటీసీ శెట్టి రమేష్, కొండల్ రావు, గణేష్, శ్రీనివాస్, అనీల్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మహబూబాబాద్: తాగునీటి సమస్యను పరిష్కరించాలని గోపాలపురం కాలనీ మహిళలు కోమురమ్మ, సునీత డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని హస్తినాపురం, గోపాలపురం కాలనీలలో శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్ అయి 15రోజులు దాటినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం



నెహ్రూసెంటర్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: కార్మికుల హక్కులు, చట్టాల అమలు కోసం పోరాటాలు నిర్వహించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వత కోటేష్, హలావత్ లింగన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో కార్మిక దినోత్సవం మేడే పోస్టర్ల ఆవిష్కరణ సభ శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను పాలక ప్రభుత్వాలు రద్దు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మేడే ఉత్సవాలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెల్లబోయిన లక్ష్మయ్య, కృష్ణ, సురేష్, రాజ్‌కుమార్, రామ్మూర్తి, లింగన్న, ఉప్పలయ్య, కల్యాణ్, వెంకన్న పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి

మరిపెడ/మరిపెడ రూరల్: మేడే వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ కోరారు. ఈమేరకు మరిపెడలో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కార్మిక సంఘాల నాయకులు, సభ్యులు, కూలీలు హాజరుకావాలని ఆయన కోరారు. ఆయనతోపాటు సీపీఐ పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న, ఏఐసీటీయూ నాయకులు నారాయణ, అంజి, వెంకన్న, ఎంకన్న, రమేష్, సూదులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో విఫలం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నెల్లికుదురు: మండుతున్న ఎండలకు ఉపాధి హామీ పనుల వద్ద తాత్కాలిక ఏర్పాట్లు టెంట్, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల వంటి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని సంఘం అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముంజంపల్లి వీరన్న, ఉమ్మగాని సత్యం విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పనులపై సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని శ్రీరామగిరి, బంజర గ్రామాలల్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఎండాకాలంలో కొలతలతో సంబంధం లేకుండా ప్రతి కూలీకి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలకు ప్రమాదభీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అనిల్, పుల్లయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు



పూజలో పాల్గొన్న మాలధారులు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అభయాంజనేయస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భాగంగా అభయాంజనేయస్వామి, నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించి, నాభిశిల, మారెమ్మ తల్లుల వార్షికోత్సవం జరిపారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవతామూర్తుల సేవలో తరించారు. దేవాలయ అభివృద్ధి, శివకోటి నర్సయ్య కుమారుడు మాధవివెంకటాచారి రూ.1,011,11 విరాళంగా ఇచ్చారు. ప్రతిష్ఠాపన పూజలను కొలిశెట్టి సత్యనారాయణ, మలికంటి రమేష్, కొంపెల్లి సుధాకర్ రెడ్డి, శివకోటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 22 మంది ఆంజనేయస్వామి మాలలు ధరించి నిర్వహించారు. రేపు ఉదయం బొడ్రాయికి వార్షికోత్సవ అభిషేకాలు జరుగుతాయని భక్తులు తమ ఇళ్ల వద్ద నుంచి జల బిందెలతో వచ్చి అభిషేకాలు నిర్వహించాలని కమిటీ బాధ్యులు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. మండలంలోని ఎల్లంపేట గ్రామం పెద్దచెరువు శిఖంలో ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం అయిన పెద్దమ్మగుడిని నూతనంగా నిర్మించి పెద్దమ్మ విగ్రహాన్ని పూజారులు శుక్రవారం ఘనంగా ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మమయ్య, ఆంజనేయులు, దుండి వీరన్న, అశోక్, గుడిసె వెంకన్న, వెంకన్న, కొండం దశరథ, వీరభద్రం, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ రఘురాములు పాల్గొన్నారు.

మాటలతో కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న రెడ్యానాయక్

డోర్నకల్: సీంఎం, మంత్రులు హామీలు అమలు చేయకుండా మాటలతో కాలం వెళ్ల దీస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మహబూబాబాద్‌పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని కోరుతూ శుక్రవారం చిలుకొయ్యలపాడు, అందనాలపాడు, మన్నెగూడెం, ముల్కలపల్లి, తొడేళ్లగూడెం తదితర గ్రామాల్లో పర్యటించి బీఆర్ఎస్ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్, పీఏసీఎస్ చైర్మన్లు కొండపల్లి సీతారామిరెడ్డి, చేరెడ్డి బిక్షంరెడ్డి పాల్గొన్నారు.

బొడ్రాయి వేడుకలు

మరిపెడ రూరల్: మండలంలోని ఆనెపురం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాల్లో వేద పండితులు బొడ్రాయికి పూజలు చేశారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం బొడ్రాయికి గ్రామస్తులందరు బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకోనున్నారు. కార్యక్రమంలో యాకయ్య, వెంకన్న, వీరన్న, రవి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత, ఆలయ ఈఓ వేణుగోపాలాచార్యులు, అర్చకులు రమణశర్మ, పవన్‌శర్మ, శ్రీకాంత్ శర్మ, మహకాళి రాజాశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా చంద్రయ్య

బయ్యారం: బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా కురియాల చంద్రయ్యను నియమిస్తూ శుక్రవారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నియామక పత్రాన్ని అందజేశారు.

సమావేశానికి హాజరుకావాలి

కేసముద్రం: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 27న(శనివారం) నిర్వహించనున్న వికలాంగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి సంఘం మండలాల అధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరుకావాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెపాక శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సామల వీరభద్రం, మీరాసాహెబ్, కేతమ్మ, ఉమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

గంగారం: మండలంలోని దుబ్బగూడెంలో పోలింగ్ స్టేషన్‌ను గూడూరు సీఐ బాబురావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలతో సీఐ మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

హార్వెస్టర్ కింద పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి



వెంకన్న (ఫైల్)

మరిపెడ రూరల్: ప్రమాదవశాత్తు వరికోసే యంత్రం (హార్వెస్టర్) కింద పడి ఓ ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గాలివారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని టిలావత్‌తండా శివారులో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్తులు కథనం ప్రకారం.. గాలివారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ట్రాక్టర్ డ్రైవర్ టిలావత్ వెంకన్న (36) ధాన్యం సేకరణ కోసం తన ట్రాక్టర్‌ను తీసుకొని అమృనాయక్‌తండాకు చెందిన కౌలు రైతు బానోతు రెడ్డి పొలం వద్దకు వెళ్లాడు. బానోతు రెడ్డి కౌలుకు చేసిన వరి పొలాన్ని హార్వెస్టర్‌తో కోత కోపిస్తున్నాడు. హార్వెస్టర్ వరి కోస్తున్న క్రమంలో వెంకన్న ప్రమాదవశాత్తు యంత్రం కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలిగి ఉన్నారు. సంఘటన స్థలానికి సెకండ్ ఎస్సై సంతోష్ సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వడదెబ్బతో ఒకరు..

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కాలనీకి చెందిన గండికోట యాకన్న (38) వడదెబ్బకు గురై శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు.. బండలు కొట్టి కుటుంబాన్ని పోషించే యాకన్న రోజు మాదిరిగానే ఉదయం పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి కొంత సమయం తర్వాత అస్వస్థతగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు యాకన్న అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

పెద్దవంగర: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని బుధవారం తీవ్రంగా గాయపడిన ఎడవెల్లి అశోక్ రెడ్డి(45) మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సరిత, కొడుకు విఘ్నేశ్వర్ రెడ్డి, కూతురు సౌమ్య పిల్లలు ఉన్నారు.

చెరువులో పడి వృద్ధుడి..

కేసముద్రం: ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఓ వృద్ధుడు, చెరువులో పడి మృతదేహంగా కనిపించిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన మలిశెట్టి సారయ్య(65) అనే వృద్ధుడు, ఈ నెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినప్పటికీ ఎక్కడా కనిపించలేదు. ఈ క్రమంలో ఇనుగుర్తి శివారులోని బేడిచెరువులోని గుంతలో మృతదేహం కనిపించడంతో, వెళ్లి చూడగా సారయ్యగా గుర్తించారు. ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి సారయ్య మృతి చెందినట్లు ఎస్సై తెలిపాడు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



కురవి: ఇంటర్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థి అదృశ్యమైనట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని కురవి మండలం కందికొండ గ్రామానికి చెందిన తోట కందయ్య రెండో కుమారుడు తోట ఉదయ్‌కిరణ్ ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం మరిపెడ మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ కాలేజీలో చదువుకుంటున్నాడు. ఈనెల 24వ తేదీన ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చాయి. అదే రోజు ఫలితాలు తెలుసుకునేందుకు మానుకోటకు ఉదయ్‌కిరణ్ వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోయే సరికి తల్లిదండ్రులు బంధువుల ఇళ్లల్లో ఆరా తీశారు. గురువారం ఫిర్యాదు చేసినట్లు జరిగిందని ఎస్సై విజయ్‌రాంకుమార్ శుక్రవారం తెలిపాడు. ఉదయ్‌కిరణ్ ఒక సబ్జెక్టు ఫెయిల్ అయ్యాడు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



గూడూరు: నర్సంపేట ఎక్సైజ్ శాఖ పరిధిలోని ఖానాపురం మండలంలోని నాజీతండా, బోటిమీదితండా, గూడూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయం పరిధిలోని లక్ష్మణ్‌తండాలలో శుక్రవారం ఎక్సైజ్ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.భిక్షపతి శుక్రవారం తెలిపాడు. దాడుల్లో 14 కేసుల్లో 9మందిని అరెస్టు చేశామన్నారు. 175 లీటర్ల నాటుసారా, 30 కేజీల చక్కెర, 5900 లీటర్ల పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగేశ్వర్‌రావు, టాస్క్‌ఫోర్స్ సీఐలు రమేష్‌చందర్, నరేష్‌రెడ్డి, ఎస్సైలు శార్వాణి, రాజేశ్వరి, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

వరి క్షేత్ర ప్రదర్శన



మహబూబాబాద్ రూరల్: చీడ పీడలను తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే సన్నరకం చిట్టి పొట్టి వరి అని జీనెక్స్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. చిట్టి పొట్టి సన్నాలు సాగు చేసిన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రజాలిపేట గ్రామంలో గుగులోతు రామునాయక్ రైతు పొలంలో జీనెక్స్ సీడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సన్నాల దిగుబడిని సందర్శించారు. అనంతరం రైతును సన్మానించారు. కార్యక్రమంలో డీలర్లు కిసాన్ ఆగ్రిమాల్ నిర్వాహకులు నల్లపు వీరన్న, రాజరాజేశ్వరీ, రవికుమార్, రఘు, కంపెనీ ఏఎస్ఎం శ్రీపాల్ రెడ్డి, సెల్స్ ఆఫీసర్లు వెంకటనారాయణ, జితేందర్, రైతులు పాల్గొన్నారు.